అశోక్‌నగర్‌లో ట్రా'ఫికర్'

● వాహనదారులు, పాదచారుల ఇక్కట్లు

చిక్కడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. ప్రాగాటూల్స్ వెళ్లే దారిలో ఉన్న అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు, రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారు రోడ్డుపైనే పార్క్ చేసిన వాహనాలతో రోడ్డు ఇరుకుగా మారిపోతోంది. దీంతో పలుసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురెదురుగా ఆర్టీసీ బస్సులు వచ్చినప్పుడు పాదచారులు కూడా రోడ్డు దాటలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఎవరో ఒకరు కల్పించుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న ద్విచక్రవాహనాలు, కార్లను జరిపితే తప్పా బస్సులు సాఫీగా వెళ్లలేని స్థితి. చలానాలు విధించి డబ్బులు వసూలు చేసుకునే ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై ఎలాంటి చొరవా చూపడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరు నెలలకు ఒకసారి రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఉన్న వాహనాలను తీసుకుపోయే ట్రాఫిక్ పోలీసులు మళ్లీ ఆరు నెలల వరకు దృష్టి సారించడంలేదు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకుని ఈ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



అశోక్‌నగర్‌లో రోడ్డులో వాహనాల రద్దీ



రోడ్డు ఇరుకుగా మారడంతో బస్సు, ఆటో ఢీకొన్నట్లుగా కనిపిస్తున్న దృశ్యం

ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం



ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డు చిన్నగా ఉండడంతో సమస్య ఏర్పడకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో ప్రతినిత్యం ఈ రోడ్డులో వాహనాలు నిలిచిపోతున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చేవారు రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి.

-శ్రీనివాస్ గుప్తా, స్థానికుడు

చర్యలు తీసుకుంటాం



అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా రోడ్డుపైనే స్తంభం ఉండడం, రోడ్డుపక్కనే భారీ వృక్షం ఉండడంవల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఏర్పడుతుంది. ఏది ఏమైనా ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకుంటాం.

-వీరేశం,
చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్

24 నుంచి టీడీసీఏ అండర్-17 క్రికెట్ టోర్నీ



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న డీజీపీ జితేందర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల 24వ తేదీ నుంచి తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అండర్-17 వన్డే టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. అమెరికా యూత్ క్రికెట్ జట్టుతో టీడీసీఏ రూరల్ వారియర్స్, రైజర్స్, పాంథర్స్ టీమ్‌లు తలపడనున్నాయి. టోర్నీమెంట్‌లో పాల్గొంటున్న జట్ల జెర్సీలను తెలంగాణ డీజీపీ జితేందర్ తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, అమెరికా యూత్ క్రికెట్ అకాడమీ అధ్యక్షుడు అరుణ్, ఎస్‌జీఎఫ్ చైర్మన్, రామిరెడ్డి, టీడీసీఏ సభ్యులు ఉస్మాన్ అలీ, సయ్యద్ నవాజ్ షా, సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.



లండన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మహిళలు

గర్భాశయ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లండన్‌లో ప్రవాస భారతీయులు స్థాపించిన బెర్క్‌షైర్ భారత్ కమ్యూనిటీ (బీబీసీ) చారిటబుల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం లండన్‌లోని స్లవ్‌లో నిర్వహించారు. ఆడవారిలో వచ్చే సెర్వికల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించామని ఆర్గనైజేషన్ కార్యనిర్వాహక సభ్యురాలు అనిత అవుల తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ ఇప్పటికీ ప్రపంచ ఆరోగ్య సమస్యగా ఉంది, కానీ టీకాలు వేయడం, స్క్రీనింగ్, ముందస్తు చికిత్సతో దాన్ని చాలావరకు నివారించవచ్చన్నారు. ప్రభుత్వాలు, ఆరోగ్యసంరక్షణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు క్యాన్సర్ నివారణకు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు లీలా అంజిరెడ్డి, సుచిత్ర, మహిళలు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు గంగపుత్ర సంఘం కృతజ్ఞతలు

కవాడిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర ప్రదేశ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, యువజన విభాగం అధ్యక్షుడు అంబటి మల్లయ్య సుధాకర్ తదితరులు సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలులో పాల్గొన్న కాకతీయ హైస్కూల్ డైరెక్టర్ గోక నవీన్, ప్రిన్సిపాల్ రామరాజు ఉపాధ్యాయులు తదితరులు

ఘనంగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

రాంనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాంనగర్‌లోని కాకతీయ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ఉపాధ్యాయులు, యాజమాన్యం ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కాకతీయ హైస్కూల్ డైరెక్టర్ గోక నవీన్, ప్రిన్సిపాల్ రామరాజు, అడ్మిన్ జ్యోతి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ముందుగా ప్రశ్నాపత్రం పూర్తిగా చదివి తమకు సమగ్రంగా వచ్చిన ప్రశ్నా జవాబులు రాసి తర్వాత మిగతా వాటికి ప్రయత్నించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. జూనియర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులు బెస్ట్ ఆఫ్ లక్ అని చెబుతూ వీడ్కోలు పలికారు.



పురస్కారగ్రహీతలతో కోలేటి దామోదర్‌గుప్తా, ఆమని తదితరులు

ఘనంగా ఉగాది విశిష్ట ప్రతిభా పురస్కారాలు ప్రదానం

చిక్కడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆర్‌ఆర్ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన ఉగాది విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదాన సభ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారాలు బహూకరించిన తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా మాట్లాడుతూ సంస్థ నిర్వాహకులు, ప్రముఖ గాయని ఆమని వివిధ రంగాల ప్రముఖులు, వర్ధమానులను ఎంపిక చేసి వారికి ప్రతిభా పురస్కారాలు ఇవ్వడం విశేషమన్నారు. కార్యక్రమంలో గాయకుడు చంద్రతేజ, ఇందునయన తదితరులు పాల్గొన్నారు. శోభన్ సినీ సీల్‌వెల్ సుస్వరాలు పేరిట ప్రముఖ గాయనీగాయకులచే సంగీత విభావరి జరిగింది.

అర్హులైన దళితులకు అవకాశం కల్పించండి

● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌కు బీఆర్‌టీయూ విజ్ఞప్తి

గోల్నాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా హైదరాబాద్ జిల్లాలో అర్హులైన దళితులకు అవకాశం కల్పించాలని హైదరాబాద్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) రమేష్‌ను బీఆర్‌టీయూ కార్మిక సంఘం జిల్లా నేతలు పూలే నిరంజన్, కందిమల్ల కృష్ణ, వంగూరు ఉపేందర్‌లు కోరారు. గురువారం ఈడీ రమేష్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకేను అందజేసి రాజీవ్ యువ వికాసం పథకం క్రింద అర్హులైన దళితులకు అవకాశం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న దళితులకు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద కార్పొరేషన్ ద్వారా రుణాలు కల్పించాలని వారు విన్నవించుకున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారందరికి రుణాలు అందేలా వ్యవహరిస్తామని ఈడీ పేర్కొన్నట్లు వారు తెలిపారు.

ఇద్దరు రైలు ప్రయాణికుల మెడలోని బంగారు ఆభరణాలు చోరీ

బర్కత్‌పుర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు రైలు ప్రయాణికుల మెడలోని బంగారు ఆభరణాలను దొంగలు లాక్కొని పారిపోయారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... దిల్‌సుఖ్‌నగర్‌లో నివాసం ఉంటున్న శ్రీలత(48) తిరుపతి నుంచి కాచిగూడకు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుంది. గురువారం తెల్లవారు జామున డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో సిగ్నల్ కోసం రైలు ఆగగా శ్రీలత మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసులు రైలు బోగి కిటికిలో నుంచి దొంగలు లాక్కొని పారిపోయాడు. మరో సంఘటన కూడా డోన్ రైల్వే స్టేషన్ సమీపంలోనే జరిగింది. నంద్యాలకు చెందిన ప్రమీలమ్మ (55) గుంటూరు - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుంది. డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆమె మెడలో ఉన్న తులంన్నర బంగారు మంగళ సూత్రం దొంగ లాక్కొని పారిపోయాడు. ఈ రెండు సంఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం కర్నూలు రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

అతి వేగంతో దూసుకువచ్చిన కారు

● ధ్వంసమైన ద్విచక్ర వాహనాలు

అంబర్‌పేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో కారు నడిపి ఓ వ్యక్తి పలు వాహనాలను ఢీ కొట్టిన సంఘటన అంబర్‌పేట లో చోటుచేసుకుంది. బోరబండలో నివాసముండే అఫ్జల్ అమెజాన్ కంపెనీలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి కంపెనీ ఉద్యోగులను ఇంటి దగ్గర విడిచిపెట్టడానికి ఛే(6) నంబర్ వైపు నుంచి ఉప్పల్‌కు వెళ్తున్నాడు. ఫ్లై ఓవర్‌పై మితిమీరిన వేగంతో వాహనం నడిపిన అఫ్జల్ ఫ్లై ఓవర్ దిగిన తర్వాత ఉన్న ట్రై కలర్ హాస్పిటల్ సమీపంలో వాహన వేగాన్ని అదుపు చేయలేక రోడ్డు పక్కన టైలర్ షాప్ ముందు ఆపి ఉన్న ఆరు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. ఈ ఘటనలో వాహనాలపై ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. వేగంగా ఉన్న వాహనం టైలర్ షాప్ లోకి దూసుకువెళ్లడంతో టైలర్ షాపులోని సామాగ్రి ధ్వంసం అయింది. ఘటనలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు . సంఘటన కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రోడ్డు దాటుతున్న మహిళను ఢీ కొట్టిన ఆటో...


రోడ్డు దాటుతున్న ఓ మహిళను ఆటో ఢీ కొట్టిన ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. అంబర్‌పేట సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాకలో నివాసం ఉండే లక్ష్మి వయస్సు 65 గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పెరల్ గార్డెన్ సమీపంలో రోడ్డును దాటుతోంది. అదే సమయంలో వేగంగా వచ్చిన ఎలక్ట్రికల్ ఆటో టీజీ 11 టీ0635 ఆమెను ఢీ కొట్టింది ఈ ఘటనలో లక్ష్మి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం తరలించారు.

పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ మమ్మద్ ఖాజాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నివర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

రాంనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని తెలంగాణలో కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్దత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన నేపథ్యంలో గురువారం తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్‌లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శాలువాకప్పి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రానికి బీసీ బిల్లు చట్టబద్దత కోసం తీర్మానం చేసి పంపించి ఊరుకోమని దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. తెలంగాణలో కులగణన చేపట్టి 42 శాతం స్థానిక సంస్థలతో పాటు ఉద్యోగ ఉపాధిలలో కూడా రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు పూలబొకే అందజేస్తున్న బాలగొని బాల్‌రాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్ తదితరులు



నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

క్యాబ్ డ్రైవర్ గంజాయి దందా

● సరఫరాదారుడితోపాటు విక్రేత అరెస్ట్

● 3 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్న క్యాబ్ డ్రైవర్‌తోపాటు అతడికి సరఫరా చేస్తున్న ఆటో డ్రైవర్‌ను హెచ్‌న్యూ, చిక్కడపల్లి పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. అంబర్‌పేటకు చెందిన దారా శ్రవణ్‌కు గంజాయి అలవాటు ఉంది. ఇతడు డీజేగా పనిచేస్తూ అదనపు ఆదాయం కోసం క్యాబ్ నడిపేవాడు. మహారాష్ట్రకు వెళ్లినపుడు అకోలా ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ షేక్ అజహర్ పరిచయమయ్యాడు. ఒడిశా నుంచి గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రలో విక్రయించే అజహర్ నుంచి శ్రవణ్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేవాడు. ఈ దందాపై హెచ్ న్యూ పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల శ్రవణ్ కోరిన మేరకు 3 కిలోల గంజాయిని హైదరాబాద్‌కు తెచ్చిన అజహర్‌ను, తీసుకుంటున్న శ్రవణ్‌ను హెచ్‌న్యూ సిబ్బంది, చిక్కడపల్లి పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. వారినుంచి 3 కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

బడ్జెట్‌పై ఎమ్మెల్యే ఆరోపణలు అర్ధరహితం

- టీపీసీసీ కార్యదర్శి దశరథ్

రాంనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వార్షిక బడ్జెట్‌పై ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆరోపణలు అర్ధరహితం అని టీపీసీసీ కార్యదర్శి దశరథ్ పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ జరగలేదని ఎమ్మెల్యే అసత్య వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం బడ్జెట్‌పై ఆయన చేసిన ఆరోపణలు తగదన్నారు.

తాగిన మైకంలో ఇద్దరిపై కత్తితో దాడి

బర్కత్‌పుర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో అన్నం వండే గిన్నెలు ఇవ్వలేదని కోపంతో ఓ యువకుడు ఇద్దరిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఢిల్లీకి చెందిన ఫారుఖ్‌ఖాన్ సైఫీ(22) వృత్తిరీత్యా ఏసీ టెక్నీషియన్. ఆయనతో పాటు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన ఫారుఖ్‌ఖాన్ అలీ (21) ఆయన సోదరుడు ఆయాన్ (22) కాచిగూడ పీఎస్ పరిధిలోని అమృతహరి ఆర్కేడ్ కాంప్లెక్స్‌లోని 4వ అంతస్తులో నివాసం ఉంటూ ఏసీ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఫారుఖ్‌ఖాన్ సైఫీ రూమ్‌కు వచ్చి పక్క రూమ్‌లో ఉంటున్న ఫారుఖ్‌ఖాన్ అలీని వంట వండుకోవడానికి గిన్నెలను అడిగాడు. తాము భోజనం చేస్తున్నామని తర్వాత ఇస్తామని చెప్పడంతో తాగిన మైకంలో ఉన్న ఫారుఖ్‌ఖాన్ సైఫీ కత్తితో ఫారుఖ్‌ఖాన్ అలీ, అడ్డువచ్చిన అన్నయ్య ఆయాన్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో ఇద్దరికి ఛాతి, వీపుపై గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. ఫారుఖ్‌ఖాన్ సైఫీని అదుపులోకి తీసుకుని అతనిపై అటెంప్ట్ మార్డర్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఇందిరాపార్కువద్ద జరిగిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న తెలంగాణ న్యాయవాదుల సురక్షా సమితి నేతలు

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలి

● తెలంగాణ న్యాయవాదుల సురక్షా సమితి

కవాడిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని తెలంగాణ న్యాయవాదుల సురక్షా సమితి డిమాండ్ చేసింది. న్యాయవాదుల సురక్షా సమితి ఆధ్వర్యంలో న్యాయవాదుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఇందిరాపార్కువద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ న్యాయవాదుల సురక్షా సమితి అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి అహ్మద్ పాషా, ఉపాధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ.. న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులను అరికట్టడానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని వారు కోరారు. ఆంధ్ర, తమిళనాడు, కేరళ తరహాలో జూనియర్ అడ్వకేట్స్ కనీసం ఐదేళ్ల పాటు నెలకు ఐదువేల భృతిని చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

అరుంధతీనగర్‌లో సమస్యల పరిష్కరిస్తాం

● కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అరుంధతీనగర్ బస్తీవాసుల సమస్యలను త్వరలో శాశ్వతంగా పరిష్కారానికి కృషి చేస్తానని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ తెలిపారు. మంచినీటి సరఫరా పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతిని మంచినీటి లీకేజీలు, లోప్రెషర్ సమస్య, వరదనీరు నిలిచిపోయి బస్తీలోని లోతట్టు ప్రాంతం ద్వారా బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఫిర్యాదును అందుకున్న కార్పొరేటర్ గురువారం బస్తీలో పర్యటించారు. త్వరలో పనులు ప్రారంభించి మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు.

కాచిగూడ డివిజన్‌లో ప్యాచ్‌వర్క్ పనులు

బర్కత్‌పుర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో వెంటనే ప్యాచ్‌వర్క్ పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. డ్రైనేజీ, మంచినీరు, వరదనీటి కాలువల పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. గురువారం డివిజన్‌లోని చప్పల్ బజార్, ఇందిరానగర్‌లో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చాలి

చిక్కడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ గాంధీనగర్ విజయబ్యాంక్ లేన్‌లో రోడ్డుపై గుంతలను పూడ్చివేయాలని టీడీపీ గాంధీనగర్ డివిజన్ ఇన్‌చార్జి భవాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఉన్నాయని దీంతో రాత్రిపూట వాహనచోదకులు గుంతల్లో పడి గాయాలపాలౌతున్నారన్నారు. వర్షం వచ్చిందంటే గుంతలు కనపడక చీకట్లో వాహన చోదకులు అందులో పడిపోతున్నారన్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించి గుంతలకు ప్యాచ్‌వర్క్‌లు చేసి పూడ్చాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.



ఏవీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ ప్రపంచ పిచ్చుకల దినోత్సవంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు

ఏవీ కళాశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

కవాడిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ గగన్‌మహల్ ఏవీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏవీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ పున్నమి పద్మ మాట్లాడుతూ అంతరించిపోతున్న పిచ్చుకలను సంరక్షించడం కోసం పర్యావరణ హితంగా కొబ్బరి బొండాలను. ఉపయోగించి నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. కొబ్బరి బొండాలు మూడు నెలల వరకు నీటితొట్టెలుగా ఉపయోగపడాయని కొబ్బరి బొండాల పనితీరును శాస్త్రీయంగా పద్మ వివరించారు. ముఖ్యంగా రేడియేషన్ వల్ల పిచ్చుకలు అంతరించిపోతున్నాయని, మొబైల్ వాడకం, సెల్‌ఫోన్ టవర్లు విరివిగా ఏర్పాటు చేయడంతో పిచ్చుకుల సంతతి గణనీయంగా తగ్గిపోతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పున్నమి పద్మ, వృక్షశాస్త్రానికి చెందిన ఆచార్యులు శ్రీనివాస రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేష్, రసాయన శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇందిరాపార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వాకర్స్, బీజేపీ నేతలు

దారికి అడ్డంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహాలను తొలగించాలి

● బీజేపీ నేతలు, ఇందిరాపార్కు వాకర్స్ సభ్యుల డిమాండ్

కవాడిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరాపార్కు ప్రధాన ద్వారంలో ఏర్పాటుచేసిన విగ్రహాల వల్ల వాకర్స్‌కు నిత్యం ఇబ్బందులుతలెత్తే ప్రమాదం ఉందని వాకర్స్ బీజేపీ నేతలు ఆరోపించారు. ఇందిరాపార్కులో టికెట్ కౌంటర్‌దాటిన వెంటనే వాకర్స్, సందర్శకులు వేళ్లే దారిలో భారీ విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల పార్కులోకి వచ్చే వాకర్స్ సందర్శకులు ఇబ్బందులు పడతారని వారు పేర్కొన్నారు. గురువారం ఇందిరాపార్కులో దారికి అడ్డంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహాల వద్ద బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, నగర నాయకులు ఎంసీ మహేందర్‌బాబు, ఇందిరాపార్కువాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు. బీజేపీ నాయకులు నర్సింహాచారి నిరసన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌చారి పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని అభినందిస్తూ ఆయనను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు ఎండగడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు దగ్గరయ్యేలా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ., ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు

కవాడిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ దోమలగూడ హనుమాన్ దేవాలయ హుండీని గురువారం లెక్కించారు. అక్టోబర్ నెల నుంచి మార్చి వరకు రూ.1,40,606 రూపాయలు హుండీ ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ ఈవో దేవనాథం తెలిపారు. ఆలయ అర్చకులు అల్లం ప్రభు, మహేందర్, వేషాద్రి, భక్తులు కేఆర్‌కే ప్రసాద్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, పరమేశ్వర్, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, సాయి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.